క్లుప్తంగా

ఘనంగా ఎలక్ట్రీషియన్ల డే



ఎలక్ట్రీషియన్ల డే సందర్భంగా జెండా ఎగురవేస్తున్న యూనియన్ సభ్యులు

దుమ్ముగూడెం: మండలంలోని సీతానగరం గ్రామంలో తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ యూనియన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్ల డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రాయపూడి సూరిబాబు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. జనవరి 27 థామస్ ఆల్వా ఎడిషన్ వెలుతురును కనుగొన్న రోజును ఎలక్ట్రీషియన్ల డేగా జరుపుకుంటున్నామన్నారు. ప్రతి ఒక్క సభ్యుడు యూనియన్ కార్డు పొందాలని లేబర్ కార్డు కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బిల్లాపాటి రాజు, జిల్లా కోశాధికారి ముక్కెర రాంబాబు, మాజీ మండల అధ్యక్షుడు తెల్లం హరికృష్ణ, సభ్యులు ముక్కెర పృథ్వీ, గౌరారపు సాంబ, నిట్ట అబ్రహం, చుక్క నాగేశ్వరరావు, ముత్యాల శివప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్పీ అభినందన



దమ్మపేట ఎస్సైకి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్పీ రోహిత్ రాజ్

దమ్మపేట: జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, దమ్మపేట పోలీస్ స్టేషన్ ఎస్సై సాయి కిషోర్ రెడ్డిని అభినందించారు. చట్ట విరుద్ధ, జూద సంబంధిత కార్యకలాపాలను అరికట్టడంలో, 2024 సంవత్సరానికి సంబంధించి, జిల్లా స్థాయిలో దమ్మపేట పోలీస్ స్టేషన్ ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా కొత్తగూడెం ఎస్పీ కార్యాలయంలో దమ్మపేట ఎస్సైను, ఎస్పీ అభినందిస్తూ, సంబంధిత ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

పొదెంను కలిసిన కాంగ్రెస్ నాయకులు

అశ్వాపురం: హైదరాబాద్‌లో ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యను కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చెంచల రాము సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలపై గ్రామసభల్లో ప్రజల అభ్యంతరాలు, మండలంలో సీనియర్ కార్యకర్తల అభిప్రాయాలను వీరయ్యతో రాము చర్చించారు. కార్యకర్తలకు అండగా ఉంటానని, సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని వీరయ్య భరోసా ఇచ్చినట్లు రాము తెలిపారు.

ఉత్తమ వైద్యురాలిగా మధులిక



ప్రశంసాపత్రం అందుకుంటున్న మధులిక

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవెల్లి పీహెచ్‌సీ వైద్యురాలు మధులిక మెరుగైన సేవలకు గాను ఉత్తమ ఉద్యోగిగా ఎంపికైంది. ఈసందర్భంగా గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆమెకు ఐటీడీఏ పీఓ రాహుల్ ప్రశంసాపత్రం అందజేశారు.

లైన్‌మెన్‌గా ప్రసాద్..



ప్రశంసాపత్రం అందుకుంటున్న ప్రసాద్

బూర్గంపాడు: నాగినేనిప్రోలు విద్యుత్‌శాఖ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న మోదుగు ప్రసాద్ చేస్తున్న సేవలను గుర్తించి ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసా పత్రాన్ని అందజేశారు. రిపబ్లిక్‌డే సందర్భంగా ఐటీడీఏలో జరిగిన కార్యక్రమంలో ప్రసాద్‌కు పీఓ రాహుల్ ప్రశంసాపత్రం అందజేయగా ఏఈ ఉపేందర్, గ్రామస్తులు అభినందించారు.

కరపత్రాలు ఆవిష్కరణ

మణుగూరురూరల్: ఆరు గ్యారంటీలను అమలు చేయాలనే డిమాండ్‌తో ఫిబ్రవరి 20న నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం ఆయన కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి జక్కుల రాంబాబు, నాయకులు ఎం.నాగేశ్వరరావు, నాసర్‌పాషా, మంగీలాల్, ఆదిలక్ష్మి, సున్నం భూలక్ష్మి, లక్ష్మి, ప్రణయ్, వైఎస్‌రెడ్డి, లాలయ్య, రమేష్, నాగార్జున పాల్గొన్నారు.

స్వచ్ఛ భద్రాద్రి దిశగా అడుగులు

- చెత్త సేకరణలో జీపీ ప్రత్యేక చర్యలు
- తడి, పొడి చెత్తను వేరుగా సేకరణ
- ప్రజలకు అవగాహన కోసం ఇంటింటికీ కరపత్రాలు



పట్టణంలోని ఓ ఇంటి వంటగదిలో కరపత్రాలను అతికిస్తున్న పంచాయతీ సిబ్బంది

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణాన్ని స్వచ్ఛ భద్రాద్రిగా చేసేందుకు భద్రాచలం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే రూ.2 కోట్లతో డీఆర్‌సీసీ షెడ్డు నిర్మించారు. అందులో మెషినరీలు, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి తడి చెత్తను వేరు చేస్తున్నారు. వాటితో వచ్చే పిప్పిని ఎండ బెట్టి వాటితో బ్రిక్స్ తయారీ చేసి స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలకు ఉచితంగా పంపిణీ చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఇదిలా ఉండగా ఇప్పుడు భద్రాచలం పట్టణాన్ని స్వచ్ఛ భద్రాద్రిగా తీర్చిదిద్దేందుకు గాను ఐటీసీ వావ్ సంస్థతో పాటు భద్రాచలం గ్రామ పంచాయతీ అధికారులు నూతన ఒరవడికి అడుగులు వేస్తున్నారు. దీనిలో భాగంగానే తడి చెత్త, పొడి చెత్త, హానికర చెత్తను వేరుచేయాలని, వాటిల్లో ఏ చెత్త ఏ ఏ రోజుల్లో వాహనాల్లో వేయాలనే దానిపై అవగాహన కల్పిస్తున్నారు. అందుకుగాను ఐటీసీ వావ్ సంస్థ సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. సిబ్బందే స్వయంగా పట్టణంలోని అన్ని కాలనీల్లో ఉన్న ఇళ్లల్లో సదరు కరపత్రాలను అంటిస్తున్నారు. ప్రతి సోమవారం, బుధవారం, గురువారం, శనివారం, ఆదివారం మాత్రమే తడిచెత్తను చెత్త ఆటోలలో వేయాలని, పొడి చెత్త మాత్రం వారం రెండు రోజులు అనగా మంగళవారం, శుక్రవారం వచ్చే చెత్త వాహనాలో వేయాలని సూచిస్తున్నారు. హానికర చెత్తను ప్రతి రోజూ వేయాలని ఈ కరపత్రాలలో పొందుపరిచి, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వీటిలో ఏ చెత్తను ఏ విధంగా గుర్తించాలి అనే విషయంపై ఇప్పటికే ఐటీసీ వావ్ సంస్థతో కలిపి గ్రామ పంచాయతీ సిబ్బంది నిత్యం అవగాహన కల్పిస్తున్నారు.



ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పిస్తున్న సిబ్బంది..

సిబ్బందికి సహకరించాలి..



తడి, పొడి చెత్తతో పాటు హానికర చెత్త ఏ రోజు చెత్త వాహనాల్లో వేయాలనే సమాచారానికి సంబంధించి ఐటీసీ వావ్ సంస్థతో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది పట్టణంలోని అన్ని కాలనీల్లో కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. వారు సూచించిన విధంగానే చెత్త వేయాలి. తడి, పొడి చెత్తను వేరు వేరుగా వేయడం ద్వారా తడిచెత్తను ఉపయోగించి డీఆర్‌సీసీలో బ్రిక్స్‌ను తయారు చేయడానికి వీలుంటుంది. ఆ ప్రక్రియను ప్రారంభించాం.

– శ్రీనివాసరావు, భద్రాచలం పంచాయతీ ఈఓ

తడిచెత్త అంటే..

తడిచెత్త భూమిలో సహజంగా కలుస్తుంది. భూమిలో కలవదగ్గ వాటిని నేరుగా ఇవ్వడం వలన గ్రామ పంచాయతీ ద్వారా నూతనంగా ప్రవేశపెట్టబడిన ఎకో బ్రిక్ తయారీకి ఉపయోగపడుతుంది. పువ్వులు, పండ్లు, పండ్ల తొక్కలు, ఎండుటాకులు, పచ్చి ఆకులు, మిగిలిపోయిన అన్నం, కూరలు, టీ పొడి, కోడిగుడ్ల పెంకులు, కొబ్బరి చిప్పలు, కూరగాయల వంటివి తడిచెత్త జాబితాలోకి వస్తాయి. వీటికి తగినట్టుగా చెత్త నిర్వహణ ప్రణాళికలు ఉంటాయి.

పొడిచెత్త..

భూమిలో కలవనివి భూకాలుష్యానికి కారకమవుతున్న వస్తువులు, రీ–యూజ్, రీ సైక్లింగ్ చేసి మరలా ఉపయోగించదగ్గ వస్తువులను పొడి చెత్త జాబితాలోకి వస్తాయి. ఉదాహరణకు.. ప్లాస్టిక్ వస్తువులు, వాటర్, కూల్ డ్రింక్ బాటిల్స్, వివిధ రకాల పిండి, బిస్కెట్, చిప్స్ కవర్లు, ఇనుము, స్టీలు, ఇతర లోహపు వస్తువులు, అట్టలు, న్యూస్ పేపరు, పాత పుస్తకాలు. ఈ వస్తువులను కూడా పొడిచెత్త నిర్వహణకు తగిన విధంగా పంచాయతీ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటారు.

హానీకర చెత్త..

హానీకరచెత్త భూమిలో కలవకపోగా దానిద్వారా వెలువడే విషవాయువులతో ప్రజలు అనారోగ్యం పాలవుతారు. ఈ లక్షణాలున్న వస్తువులు హానికర చెత్త జాబితాలోకి వస్తాయి. శానిటరీ నాప్కిన్లు, డైపర్లు, సిరంజీలు, సెలైన్ బాటిళ్లు, కాస్మోటిక్ వస్తువులు, టాబ్లెట్ రేపర్లు మరియు మెడికల్ వేస్ట్, చెప్పులు, పాత బట్టలు, జుట్టు, ఇల్లు ఊడ్చిన దుమ్ము, గోనె సంచులు, టిఫిన్ తిన్న పొట్లాలు, పరుపులు వంటివి ఈ కోవాలోకి వస్తాయి.

కార్మిక సంక్షేమానికి నిరంతర కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి రాంగోపాల్

మణుగూరురూరల్: కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ నిరంతరం కృషి చేస్తుందని ఆ సంఘం బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ అన్నారు. సోమవారం జీఎం కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అనేక ఏళ్లుగా నిలిచిపోయిన స్ట్రక్చర్ సమావేశాలను పునరుద్ధరించామని, పలు కార్మిక సమస్యల పరిష్కారానికి యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. ప్రధానంగా డిస్మిస్ అయిన జెమెట్‌లను తిరిగి ఉద్యోగంలో తీసుకునేందుకు, సింగరేణి కార్మికుల పిల్లలకు మెరిట్ స్కాలర్ షిప్‌ను రెండు వేల నుంచి ఎనిమిది వేలకు పెంచడానికి, కొత్త ఇన్సెంటివ్ విధానం, క్యాడర్‌స్కీమ్‌ల అమలుకు, 11రకాల అలవెన్సుల పెంపుదలకు తదితర అంశాలను అంగీకరించినట్లు తెలిపారు. అలాగే మహిళా కార్మికుల కోసం ఆయా గనులు, డిపార్టుమెంట్ల వద్ద రెస్ట్ షెల్టర్లు, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, పీవీకాలనీలో అంతర్గత రోడ్లు నిర్మించాలని కోరారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. సింగరేణి ఏరియా ఆస్పత్రిలో గైనకాలజిస్టును నియమించాలని యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు మల్లెల రామనర్సయ్య, ఆఫీస్ బేరర్ ఆవుల నాగరాజు, ఆదర్ల సురేందర్, ఆడేపు రాజశేఖర్, నాయకులు నర్సింహరావు, శరత్, జావేద్, సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

7న వెయ్యి గొంతుకలు.. లక్ష డప్పులు

ములకలపల్లి: ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరుపతలపెట్టిన వెయ్యి గొంతుకలు, లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు పిడియాల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని జగన్నాథపురంలో సోమవారం ఆయన దండోరా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రతీ గ్రామం నుంచి ఎమ్మార్పీఎస్ సోదరులు, మాదిగ బిడ్డలందరూ డప్పు చేత పట్టుకుని కార్యక్రమానికి రావాలని కోరారు. భారీగా తరలిరావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు గంటా వెంకటేశ్వర్లు, గంటా శ్రీను, నర్సింహారావు, కనకం రాములు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు పోరాటాలు

అశ్వాపురం: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మండల కేంద్రంలోని ఎస్‌కేటీ కల్యాణ మండపంలో సోమవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ అధ్యక్షతన పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి రేగా కాంతారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత పార్టీ శ్రేణులు మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రేగా కాంతారావు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరుగుతున్నాయన్నారు. స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు

సమావేశంలో మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు కందుల కృష్ణార్జున్‌రావు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, యూత్ మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, నాయకులు ఈదర సత్యనారాయణ, గోపాలకృష్ణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యురాలి తీరుపై నిరసన



ప్రభుత్వ వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేస్తున్న వైద్య సిబ్బంది

పినపాక: పినపాక ప్రభుత్వ వైద్యురాలు దుర్గాభవాని తీరుకు నిరసనగా ఆస్పత్రి సిబ్బంది సోమవారం ధర్నా చేపట్టారు. అకారణంగా దూషిస్తోందని, అసభ్య పదజాలం వాడుతోందని ఆరోపించారు. వెంటనే ఆమెను బదిలీ చేయాలని కోరారు. సిబ్బంది జేఏసీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు. విషయంపై సాక్షి వైద్యురాలు దుర్గాభవానిని వివరణ కోరగా తనపై సిబ్బంది తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.

ప్రచారం నిర్వహించాలి

మణుగూరుటౌన్: ప్రభుత్వ నాలుగు పథకాల అమలు తీరును యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం నిర్వహించాలని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి అన్నారు. ప్రజాభవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీప్రగతి, సతీష్, దారా అశోక్, మనోజ్‌కుమార్, చైతన్య నాయుడు, లిఖిత లతీఫ్, ప్రవళిక, గొల్లపల్లి నరేశ్, కరుణ్‌రెడ్డి, అజిత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి

ముమ్మరంగా సెంట్రల్ లైటింగ్ పనులు

దమ్మపేట: మండల కేంద్రంలో సుమారు రూ.6.5 కోట్ల వ్యయంతో మంజూరైన సెంట్రల్ లైటింగ్ పనులు గతంలో మందకొడిగా కొనసాగగా.. ప్రస్తుతం ముమ్మురంగా కొనసాగుతున్నాయి. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సెంట్రల్ లైటింగ్ పనులను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశాల మేరకు ముమ్మురం చేశారు. మండల కేంద్రం దమ్మపేటలోని జయలక్ష్మి టాకీస్ నుంచి మందలపల్లి జంక్షన్ వరకు మంజూరైన సెంట్రల్ లైటింగ్ పనుల్లో భాగంగా డివైడర్ మధ్యలో లోహపు విద్యుత్ స్తంభాలను అమర్చడం దాదాపుగా పూర్తయింది. ఇంకనూ వాటికి విద్యుత్ సరఫరా, డివైడర్ మధ్యలో మొక్కలను ఏర్పాటు చేయాల్సి ఉంది.



దమ్మపేటలో డివైడర్ మధ్యలో అమర్చిన విద్యుత్ స్తంభాలు

ఇద్దరికి డీటీలుగా పదోన్నతి

అశ్వాపురం: అశ్వాపురం తహసీల్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.రాజేశ్వరరావుకు డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతి లభించింది. ఇటీవల జిల్లాలో 15 మందికి డీటీలుగా పదోన్నతులు కల్పించగా జాబితాలో ఆయనతో పాటు భద్రాచలం ఆర్డీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ డిప్యూటేషన్‌పై అశ్వాపురంలో కొనసాగుతున్న వి.కాంతయ్యకు అవకాశం దక్కింది. కాగా, మండలంలో ఆర్ఐగా, సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించిన రాజేశ్వరరావు పదోన్నతి పొందడంతో తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ వరప్రసాద్, ఉద్యోగులు సోమవారం అభినందించారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ సతీష్‌కుమార్

మణుగూరుటౌన్: డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్ వినియోగం, మద్యం సేవించడం వంటి చర్యలకు పాల్పడి ప్రమాదాలకు కారణం కావొద్దని మణుగూరు సీఐ సతీష్ సూచించారు. సోమవారం పట్టణంలోని స్నేహాగార్డెన్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా పినపాక, అశ్వాపురం, మణుగూరు ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో బస్సు డ్రైవర్లు, అటెండర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. సమావేశంలో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ పుల్లయ్య, ఎస్ఐ మేడ ప్రసాద్, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులు యూసఫ్, అరవింద్, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఇసాక్ థామస్, సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణకు పద్మశ్రీపై హర్షం

అశ్వారావుపేట: మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు వరించడం పట్ల అశ్వారావుపేటలో ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక రింగ్‌సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కోటేటి పకీరయ్య, జుజ్జూరపు శ్రీరామమూర్తి, నార్లపాటి మహేష్‌బాబు, నాగరాజు, దిలీప్, డాక్టర్ శివాజీ తదితరులు పాల్గొన్నారు.



అశ్వారావుపేట: నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

భద్రాచలంటౌన్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం మాదిగలకు దక్కిన అరుదైన గౌరవమని ఎమ్మార్పీఎస్ భద్రాచలం ఇన్‌చార్జ్ అలవాల రాజా పెరియర్ అన్నారు. పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో ఎమ్ఎస్పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా ఆత్మగౌరవ పోరాట యోధుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ రావడం సంతోషకర విషయమన్నారు. కార్యక్రమంలో మేకల లత, తిరుపతి, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, నరేష్, శివకృష్ణ, కుమారి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో స్వామివారి కళ్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. మాసశివరాత్రితో కూడిన సోమవారం రావడం శుభసూచికమని వేదపండితులు వెల్లడించారు. కల్యాణోత్సవం అనంతరం స్వామివారికి అభిషేకాలు జరిపించారు. ఎంఈఓ ఉండేటి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లాకు చెందిన ప్రముఖులు మునురావుల సత్యనారాయణ, అరుణ దంపతులు పీటలపై కూర్చుని స్వామి వారి కల్యాణం జరిపించారు.

భౌతిక దాడులు గర్హనీయం

- కాంగ్రెస్‌పై బీఆర్‌ఎస్ విమర్శ

అశ్వారావుపేట/చంద్రుగొండ: అర్హులకే సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని కోరిన బీఆర్‌ఎస్ నాయకులపై కాంగ్రెస్ శ్రేణులు భౌతికదాడులకు దిగడం గర్హనీయమని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని బెండాలపాడులో జరిగిన ఘటనలో గాయపడిన కొడెం రవిని ఖమ్మం ఆస్పత్రిలో సోమవారం పరామర్శించిన ఆయన చంద్రుగొండలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకుడు మెడా మోహన్‌రావుపై దాడి చేసిన వారిని తక్షణమే పోలీసులు అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మాజీ జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు దారవెంకటేశ్వరరావు, నల్లమోతు వెంకటనారాయణ, నరుకుళ్ల సత్యనారాయణ, భూపతి రమేష్, సూరా వెంకటేశ్వర్లు, జీ రమేష్, కొల్లం వెంకటేశ్వర్లు, సత్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు. కాగా, బెండాలపాడులో బీఆర్‌ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడటం సరికాదని అశ్వారావుపేట మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి అన్నారు. అశ్వారావుపేటలో సోమవారం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో ప్రశాంతంగా ఉన్న అశ్వారావుపేట నియోజకవర్గంలో ఇప్పుడు గొడవలు మొదలయ్యాయని తెలిపారు. బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి ప్రకాశరావు, పట్టణ అధ్యక్షుడు సత్యవరపు సంపూర్ణ, నాయకులు జుజ్జూరపు శ్రీరామమూర్తి, చిప్పనపల్లి బజారయ్య, తాళం సూరి, మోటూరి మోహన్, చరణ్, తగరం హరి పాల్గొన్నారు.

దమ్మపేట: చంద్రుగొండ మండలంలోని బెండాలపాడు గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో, ప్రజల కోసం ప్రశ్నించిన ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నాయకులపై, కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన దాడి చేశారని బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి దొడ్డా రమేష్ సోమవారం ఆరోపించారు. ఈ చర్యలను ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై స్పందించిన నాయకులపై దాడులు చేయడాన్ని హేయమైన చర్యగా అభివర్ణించారు.



మాట్లాడుతున్న అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

ములకలపల్లి: చంద్రుగొండ మండల బీఆర్‌ఎస్ నాయకుడు మేడా మోహన్‌రావుపై కాంగ్రెస్ మూకల దాడి హేయమైన చర్య అని పార్టీ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు అన్నారు. ములకలపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే భౌతిక పాల్పడుతారా? అని ఆయన ప్రశ్నించారు. సంక్షేమ పథకాల అమలులో నెలకొన్న లోపాలను ఎత్తిచూపుతున్నారనే అక్కసుతోనే ఇంతటి దురాఘతానికి ఒడిగట్టారని ఆరోపించారు. దాడి కారకులను వెంటనే అరెస్ట్ చేయాలని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మాజీ జెడ్పీటీసీ సున్నం నాగమణి, శనగపాటి సీతారాములు, తానం కృష్ణ తదితరులు ఉన్నారు.

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): చంద్రుగొండ మండలంలోని బెండాలపాడులో బీఆర్‌ఎస్ నాయకులు మెడా మోహన్‌రావు, కొడెం రవిలపై దాడి చేయడం పట్ల బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, సొసైటీ చైర్మెన్ బోయినపల్లి సుధాకర్‌రావు ఖండించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భౌతిక దాడులు సరికాదన్నారు. ఈ సమావేశంలో చల్లా రాంబాబు, పి.పుల్లారావు పాల్గొన్నారు.

ఆరోపణలు అర్థరహితం

- కాంగ్రెస్ ప్రతివిమర్శ..

చంద్రుగొండ: తమపై దాడి చేశారని బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఖండించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే అసత్య ఆరోపణలు చేస్తున్నారని ప్రతి విమర్శలు చేశారు. దారం గోవింద రెడ్డి, భోజ్యానాయక్, కృష్ణారెడ్డి, నల్లమోతు రమణ, టీ సురేష్, సారేపల్లి శేఖర్, బొర్రా సురేష్, ఫజల్‌బక్ష్, ఎస్డీ రసూల్ పాల్గొన్నారు.

